సాక్షి నిర్మల్

మంగళవారం । 4 । జూలై । 2023

గరిష్ఠం/కనిష్ఠం 33.3 /25.5

వాతావరణం

ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.



జల్.. జమీన్ పోరాటం

ఖానాపూర్: ఖానాపూర్ మండలం సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లేడుకుంట గ్రామంలో 30 ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న త మకు పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రా మయ్య మాట్లాడుతూ సేవ్యానాయక్ తండాకు చెందిన గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు అధికారులు పట్టాలు ఇవ్వాలన్నారు. 2022, నవంబర్ 16న క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులు నేటికీ పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. జిల్లేడు కుంటలో సాగుచేసిన 50 మంది పేర్లు పోడు భూముల లబ్ధిదారుల జాబితాలో లేవని పేర్కొన్నారు.



ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. కమిషనర్ అందుబాటులో ఉండడం లేదని విమర్శించారు. సోమవారం 11 దాటినా కమిషనర్ కార్యాలయానికి రాలేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్‌కు కాలనీవాసులు తమ గోడు వెల్లబోసుకున్నారు. సమస్య పరిష్కారానికి చైర్మన్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గురుభ్యోనమః



గండి రామన్న ఆలయ ఆవరణలోని సాయిబాబా ఆలయంలో మధ్యాహ్న హారతిలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: గురు పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని గురు దేవాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. బాసరలోని వ్యాస మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. నిర్మల్‌లోని శ్రీగండిరామన్న సాయిబాబా ఆలయంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సతీసమేతంగా పూజలు చేశారు. ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి మంత్రి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంజులాపూర్ సాయిబాబా ఆలయంలో ఆలయ వైస్ చైర్మన్ కరోల్ల శంకర్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అన్ని ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు



కన్యాపూర్ బ్రహ్మేశ్వరాలయంలో సత్యానంద స్వామీజీకి పూజలు చేస్తున్న రామారావుపటేల్

న్యూస్‌రీల్

నిర్మల్ వైద్యుడికి ఉత్తమ పురస్కారం



పురస్కారం అందిస్తున్న ఐఎంఏ బాధ్యులు

నిర్మల్ ఖిల్లా: జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు డాక్టర్ ఉదగిరి రామకృష్ణకు ఉత్తమ పురస్కారం అందించారు. ఆపత్కాలంలో నిర్విరామంగా వైద్య సేవలు అందిస్తున్న వైద్యులను రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసి పురస్కారాలు అందజేసినట్లు ఐఎంఏ రాష్ట్రస్థాయి బాధ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ సంపత్, డాక్టర్ కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉర్సు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫినగర్‌లో హజ్రత్ సోఫి హుస్సేన్ అలీషా రహ్మతుల్ అలై దర్గా ఉర్సు మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. మంచినీటి సదుపాయం, పార్కింగ్, లైట్స్ ఏర్పాట్లు చేశామని వివరించారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు మతిన్, అన్వర్, రఫీ, జిషాన్, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

స్వీపర్స్‌ను ఆదుకోవాలి



దీక్షలో పాల్గొన్న స్వీపర్లు

నిర్మల్‌టౌన్: జిల్లా, మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లను ప్రభుత్వం ఆదుకోవాలని స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర స్వీపర్స్ సంఘం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.27 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల్లో స్వీపర్లను నియమించాలని కోరారు. దీక్షలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి సత్తన్న, కోశాధికారి లక్ష్మీనరసయ్య, సభ్యులు గంగాధర్, రమేశ్, నయీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహా గరళం!



బాసర వద్ద గోదావరి నది | మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా బాలాపూర్ శివారులోని ఆల్కహాల్ ఫ్యాక్టరీ →



- వ్యర్థాలు వదులుతున్న ఆల్కహాల్ కంపెనీలు
- కాలువల ద్వారా బాసర వద్ద నదిలో కలుస్తున్న వైనం..
- తాజాగా బాబ్లీ గేట్లు ఎత్తడంతో మళ్లీ రిలీజ్‌కు సిద్ధం
- ఏటా వర్షాలు కురవగానే ఇదే పరిస్థితి
- అయినా చర్యలు తీసుకోని కాలుష్య నియంత్రణ అధికారులు

భైంసా: గోదావరిలో 'మహా' గరళం కలువబోతోంది. పొరుగున ఉన్న మహారాష్ట్రలోని ఆల్కహాల్ ఫ్యాక్టరీలో నెలల తరబడి నిల్వచేసిన రసాయన వ్యర్థాలను నదిలోకి వదిలేందుకు కంపెనీల యజమానులు సిద్ధమవుతున్నారు. ధర్మాబాద్ తాలూకా బాలాపూర్ గ్రామ శివారులో ఉన్న ఆల్కహాల్ ఫ్యాక్టరీ నిర్వాహకులు యేటా రసాయన వ్యర్థాలను నదిలోకి వదులుతున్నారు. బాబ్లీ గేట్లు ఎత్తి, వర్షాలు కురవగానే నదిలో ప్రవాహం మొదలవుతుంది. ఆ వెంటనే ఆల్కహాల్ ఫ్యాక్టరీ పరిసరాల్లో నిల్వ ఉంచిన రసాయన వ్యర్థాలను ప్రత్యేకంగా తవ్విన కాలువల ద్వారా నదిలో వదలడం పరిపాటిగా మారింది. తాజాగా ఈనెల 1న బాబ్లీ గేట్లు ఎత్తారు. ఈనెలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రసాయన వ్యర్థాలను గోదావరి గర్భంలోకి వదిలేందుకు ఆల్కహాల్ ఫ్యాక్టరీ నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఈయేడైనా గరళం గంగలో కలవకుండా చూడాలని నదీ పరీవాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నేరుగా నదిలోకి..

పట్టణాలు, పల్లెల నుంచి వస్తున్న మురుగునీరంతా నేరుగా గోదావరిలోనే కలుస్తోంది. పరీవాహక ప్రాంతాల్లో చెత్తను డంప్‌చేయడంతో భారీ వర్షాలకు అది కూడా కొట్టుకుపోయి నదిలో కలుస్తుంది. ఇక సరిహద్దు మహారాష్ట్రలోని ఆల్కహాల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు సైతం ఏటా వర్షాకాలంలో గోదావరినదిలోకే వదులుతున్నారు. రాష్ట్ర పరిధిలో గోదావరి నది కలుషితమవుతున్న పరిస్థితిపై కేంద్ర జలవనరుల సంఘం సీడబ్ల్యూసీ 2018, ఆగస్టు నుంచి 2020 డిసెంబర్ మధ్య గోదావరి నది ప్రవహిస్తున్న 13 ప్రాంతాల్లో నమూనాలను పరిశీలించింది. మనుషులతోపాటు పర్యావరణానికి ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన ఆర్సెనిక్, కాడ్మియం, క్రోమియం, కాపర్, లీడ్, నికెల్, ఐరన్, జింక్ వంటి లోహాలు నీటిలో ఉన్నట్లు గుర్తించింది. మోతాదుకు మించి విషపూరిత భార లోహాలు ఉన్నందున ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. మహారాష్ట్ర అధికారులతో కలిసి అక్కడి ఆల్కహాల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు గోదావరిలో కలువకుండా చూడాలంటున్నారు.

ఆ ఒక్క ఫ్యాక్టరీతో...

మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా బాలాపూర్ గ్రామ శివారులో నిర్మించిన పయోనీర్ డిస్టలరీస్ లిమిటెడ్ పేరిట ఉన్న ఆల్కహాల్ వ్యర్థాలు మనం తాగే నీటిలో కలుస్తున్నాయి. వ్యర్థాలు ముక్కుపుటలు అదిరేలా ఉంటాయి. యేటా ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే రసాయనాలను అక్కడే గోతుల్లో నిల్వ చేసి ఉంచుతారు. వర్షాలు కురవగానే మహారాష్ట్ర నుంచి బాసర వరకు ఉన్న శివారు భూముల్లో నుంచి తవ్వి ఉంచిన కాలువల ద్వారా వదులుతున్నారు.

విషపూరిత గాలి

ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్గంధం భరించలేం. భైంసా–బాసర, బాసర–నిజామాబాద్ మార్గాల్లో గాలి వీచినప్పుడు వచ్చే ఈ దుర్గంధంతో అక్కడ కాసేపు నిలబడలేం. నిర్మల్ జిల్లాలోని దోడాపూర్, టాక్లీ, బిద్రెల్లి, కిర్గుల్(బి), కిర్గుల్(కె), ఓనీ, మైలా పూర్, బాసర, నిజామాబాద్ జిల్లాలోని యంచ, బినోల తదితర గ్రామాల ప్రజలు ఈ దుర్గంధం భరిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సైతం విషపూరిత గాలినే పీలుస్తున్నారు.

కిలోమీటర్ల మేర రసాయనాల ప్రవాహం..

యేటా ఫ్యాక్టరీలో వెలువడే రసాయనాలను అక్కడే నిల్వచేసి ఉంచుతారు. భారీవర్షాలు కురిసిన సమయంలో పైప్‌లైన్ ద్వారా పంటపొలాల్లో నుంచి ఉన్న కాలువలోకి వదులుతున్నారు. బాలాపూర్, జాఫ్లాపూర్, నాయాగాం శివారులోని పంట పొలాల గుండా ఎనిమిది కిలోమీటర్లు ప్రవహించి రవీంద్రాపూర్, బాసర శివారులో గోదావరిలోకి వదులుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో యంచ గ్రామం వద్ద నిర్మించిన ఫిల్టర్‌బెడ్ ద్వారా 144 గ్రామాలకు తాగునీరు అందుతుంది. బాసర ట్రిపుల్‌ఐటీలో 8 వేల మందికి, బాసర ఆలయంలో ప్రతీ రోజు వచ్చే వేలసంఖ్యలో ఉన్న భక్తులకు, బాసర, బిద్రెల్లి, కిర్గుల్‌తోపాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకు, నిజామాబాద్, నిర్మల్ జిల్లా పరీవాహక ప్రాంతంలోని అన్ని గ్రామాలకు ఇక్కడి నుంచే తాగునీరు సరఫరా చేస్తున్నారు. తాగునీరు విషపూరితం కాకముందే అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల బదిలీలు!

- 'స్థానిక' అధికారులకు చలనం..
- జిల్లాను వీడనున్న సీనియర్లు..
- ఇప్పటికే శాఖల వారీగా జాబితా సిద్ధం
- పక్షం రోజుల్లో ట్రాన్స్‌ఫర్



నిర్మల్: మరో ఐదారు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండడంతో అధికారుల బదిలీల జా తర మొదలు కానుంది. జిల్లాలో స్థానికులైన వా రిని, దీర్ఘకాలంగా ఉన్నవారిని ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని నెలక్రితమే ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఆయా శాఖల్లో లోకల్, సీనియారిటీ ప్రకారం ఎవరెవరు బదిలీ కానున్నారనే చర్చ నడుస్తోంది. లె క్కప్రకారం ఈనెలాఖరులోగా ఈ ప్రక్రియ పూ ర్తికావాల్సి ఉంది. మరో పక్షం రోజుల్లో దాదాపు ట్రాన్స్‌ఫర్లు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. రెవెన్యూతోపాటు పోలీసుశాఖలో నూ ఏళ్లుగా ఉంటున్న చాలామంది సీనియర్లు ఎన్నికల కారణంగా జిల్లా దాటనున్నారు.

ఆరు నెలల ముందే..

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఆరునెలలే సమయముంది. గత హయాంలో కేసీఆర్ సర్కార్ ముందస్తుకు వెళ్లడంతో 2018, డిసెంబర్ 07న ఎన్నికలు నిర్వహించారు. అదే నెల 11న ఫలితాలను ప్రకటించారు. ఈసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తికాలం కొనసాగనున్నట్లు అంచనా. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌కు ముందే ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ ఆదేశాల మేరకు ఆరునెలల ముందే జిల్లాల్లో అధికారుల బదిలీలు చేపట్టాల్సి ఉంది. ఒకట్రెండు వారాలు అటుఇటు అయినా పక్షం రోజుల్లో బదిలీ ప్రక్రియ పూర్తికానుందని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. బదిలీలకు సంబంధించిన పూర్తి ప్రక్రియను రాష్ట్రస్థాయిలో చేపట్టనున్నారు. జిల్లా నుంచి ఎటు వెళ్తారో.. ఇక్కడికి ఎవరు వస్తారో కూడా స్థానికంగా ఎవరికీ తెలియదు.

స్థానికులు, సీనియర్లు..

ఎన్నికలు పూర్తి పారదర్శకంగా నిర్వహించే క్రమంలో ఎన్నికల కమిషన్ పకడ్బందీ చర్యలు చేపడుతుంది. స్థానికులు, ఏళ్లుగా ఇక్కడే ఉన్న సీనియర్లు ఎన్నికల సమయంలోనూ ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈనేపథ్యంలో అలాంటి అధికారులను ఎన్నికలకు ముందే బదిలీ చేయాలంటూ ఆదేశిస్తుంది. ప్రధానంగా రెవెన్యూ, పోలీసుశాఖలు ఎన్నికల్లో ప్రభావవంతంగా పనిచేస్తాయి. అందువల్ల బదిలీల సమయంలో ఎక్కువగా ఈ రెండు శాఖలపైనే దృష్టి ఉంటుంది. జిల్లాలో ఈ రెండు శాఖల నుంచి ఏయే అధికారులు వెళ్తున్నారనే దానిపై ఇప్పటికే చర్చ కొనసాగుతోంది. పోలీస్‌శాఖలో ఏళ్లుగా ఉన్న ఓ ఉన్నతాధికారితోపాటు పలువురు సీఐలు, ఎస్సైలు బదిలీ అవుతారనే ప్రచారం జరుగుతోంది. రెవెన్యూలోనూ స్థానికులైన చాలామంది తహసీల్దార్లు జిల్లాను వీడనున్నారు.

చకచకా పనులు..

'అరె.. మనకు పరిచయం ఉన్నసారు మల్ల ట్రా న్స్‌ఫర్ అయితడట. జల్దీ పని చేసుకోవాలె..' అంటూ జిల్లాలో చాలామంది తమ పనుల పూర్తిలో వేగం పెంచుతున్నారు. ప్రధానంగా రెవెన్యూశాఖలో భూములు, జాగాల పంచాయితీలు ఉన్నవారు త్వరితగతిన పూర్తి చేయించుకునే పనిలో ఉన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం తమ పనులను చక్కబెట్టుకునేందుకు తొందర పడుతున్నారు. కొంతమంది అధికారులూ.. 'మళ్లీ ఎప్పుడు వస్తామో.. ఇక్కడికే వస్తామో రామో..' అంటూ సంబంధిత వ్యక్తులను తొందరపెడుతున్నారు.

ఏ ఆఫీస్ ఎక్కడుందో..!



ఫర్నిచర్ పనిపూర్తి చేసి ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న గది

- కలెక్టరేట్‌లో కార్యాలయాల కన్ఫ్యూజన్
- బోర్డులు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ కొత్త జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్ భవనాలు నిర్మించారు. నిర్మల్‌లో నిర్మించిన నూతన భవనాన్ని జూన్ 4న ముఖ్యమంత్రి ప్రారంభించారు. జూన్ 19 నుంచి నూతన కలెక్టరేట్‌లో అన్ని శాఖల కార్యకలాపాలు ప్రారంభించారు. 34 శాఖల సేవలు సమీకృత భవనంలో అందుబాటులోకి వచ్చాయి. అయితే నెల రోజులు గడిచినా ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. చాంబర్లకు ఆయా శాఖల పేరు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వివిధ సేవల కోసం కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయం కనిపెట్టడానికే సమయం వృథా అవుతోంది. వృద్ధులు, దివ్యాంగులు ఫ్లోర్లు ఎక్కడానికి ఇబ్బంది పడుతున్నారు.

చాంబర్ల కోసం సిఫారసులు..

కొత్త కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు తమకు కావాల్సిన చాంబర్ల కోసం కలెక్టర్‌తో సిఫారసు చేయించుకుంటున్నారు. వాస్తు, అనువైన దిశ ఉన్న చాంబర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో చాంబర్‌లో రెండు, మూడు శాఖలు ఏర్పాటు చేయడంతో గందర గోళం నెలకొంటుందని ఉద్యోగులు చెబుతున్నారు. స్పోర్ట్స్ విభాగానికి చెందిన పాత ఆఫీసు గది ఖాళీ చేయడంతో సిబ్బంది నూతన కలెక్టర్ కార్యాలయంలో వారికి కేటాయించిన గదికి వచ్చారు. అక్కడ ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో సామగ్రిని గదిలో భద్రపర్చారు.

పూర్తికాని పనులు...

నూతన కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖలకు కేటాయించిన గదుల్లో పనులు ఇంకా పూర్తి కాలేదు. విద్యుత్, ఇంటర్నెట్, ఫర్నిచర్ వంటివి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. పలు శాఖలకు డీఆర్‌వో రూములు కేటాయించినా విద్యుత్ సరఫరా లేక కార్యాలయాలను పూర్తిస్థాయిలో బదలాయించలేక పోతున్నారు. కొన్ని శాఖలకు చెందిన ఫైళ్ల మూటలు, ఫర్నీచర్ అమర్చుకోవడంతో గందరగోళంగా మారిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. కార్యాలయం ప్రారంభమై పది రోజులు గడిచినా ఇప్పటికీ శాఖల సర్దుబాటు కాలేదు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌టౌన్: ప్రజావాణికి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి వచ్చిన వారు వివిధ సమస్యలపై 45 దరఖాస్తులు అందించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ ఓపికగా విని సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. దరఖాస్తులను శాఖల వారీగా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

- జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మివాడలో ఇటీవలే పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కలెక్టరేట్ వద్ద నినాదాలు చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- నర్సాపూర్(జి) మండలంలోని బురుగుపల్లి తండావాసులు తమకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.
- ముధోల్ మండలం అష్టా గ్రామానికి చెందిన లోలం పుష్పలత తన భర్త ముత్యం తన మామ గారి ఆస్తి అయిన 1.39 ఎకరాల భూమిని, తన పిల్లలకు చెందకుండా తన తమ్ముడికి రాసిచ్చాడని ఫిర్యాదు చేశారు.

సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న డీఈవో, సిబ్బంది

నిర్మల్ రూరల్: సమగ్ర శిక్ష, ఎమ్మార్సీలలో వివిధ పోస్టుల భర్తీ కోసం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం జరిగింది. 2019 నవంబర్‌లో ప్రభుత్వం ఈపోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్లు– 8, డాటా ఎంట్రీ ఆపరేటర్లు–7, సిస్టం అనలిస్టులు–1, అసిస్టెంట్ ప్రోగ్రామర్లు –1, ఐఈఆర్పీ– 14 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులు పూర్తిగా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. 60 మంది అభ్యర్థులకుగాను 52 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారని వెల్లడించారు. మంగళవారం కూడా పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కానివారు మంగళవారం రావాలని పేర్కొన్నారు. త్వరలోనే ప్రొవిజనల్ సెలక్షన్ జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఉట్నూర్ ఆర్డీవో బదిలీ


కదం సురేశ్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కదం సురేశ్ ఆసిఫాబాద్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. 2022 నవంబర్ 11న ఉట్నూర్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన అనతి కాలంలోనే బదిలీ అయ్యారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన మండల వాసి


బహుమతితో రామగిరి మణికంఠ

జైనథ్: జూన్ 26, 27 తేదీల్లో హర్యానా రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్ టార్గెట్ బాల్ పోటీల్లో మండలంలోని నిరాల గ్రామానికి చెందిన రామగిరి ప్రవీణ, ఆనంద్ దంపతుల కుమారుడు రామగిరి మణికంఠ సత్తా చాటాడు. మొత్తం 12మంది ఉండే టీంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి మణికంఠ ఒక్కడే ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొన్నాడు. మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలవగా తెలంగాణ రెండవ స్థానం కైవసం చేసుకుంది. దీంతో మణికంఠను జిల్లా టార్గెట్ బాల్ సెక్రెటరీ నన్నపు స్వామి, కోచ్ వీజీఎస్ రాకేష్, గ్రామ సర్పంచ్ సునంద ప్రభాకర్, ఎంపిటీసీ వైష్ణవి చంద్రకాంత్ చౌదరి, గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మిస్సింగ్ కేసు నమోదు

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామానికి చెందిన జాదవ్ అన్నపూర్ణ (22) అనే మహిళ అదృశ్యం కేసు నమోదైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... అన్నపూర్ణ కుటుంబ సభ్యులతో ఆదివారం రాత్రి ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి 1గంటల సమయంలో 5 నెలల కూతురితో ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు అన్నపూర్ణ ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త జాదవ్ ధమ్మపాల్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

దేశీదారు విక్రేతల బైండోవర్

సారంగపూర్: మండలంలోని తాంద్ర(జి) గ్రామంలో దేశీదారు విక్రయించిన ఇద్దరు వ్యక్తులను స్థానిక తహసీల్దార్ సంతోష్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశీదారు విక్రయిస్తున్నారని ముందుగా వచ్చిన సమాచారం మేరకు గ్రామంలో గస్తీ ఏర్పాటు చేయగా ఇద్దరు వ్యక్తులు దేశీదారు విక్రయిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. ఈమేరకు వారిద్దరిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి హెచ్చరించామని పేర్కొన్నారు.

వీఆర్‌కు ఎస్సై గంగన్న!



జూన్ 27న సాక్షిలో ప్రచురితమైన కథనం

- సీఎం టూర్‌కు వ్యాపారుల నుంచి విరాళాలు
- పోలీసు భోజనాల కోసం రూ.లక్షల్లో వసూళ్లు
- 'భోజన ఖర్చులివ్వండి!' శీర్షికతో 'సాక్షి'లో కథనం
- పోలీసు ఉన్నతాధికారి సీరియస్.. విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై గంగన్నను వీఆర్‌కు బదిలీ చేశారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుమురంభీం జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తుకు వచ్చే పోలీసు సిబ్బందికి భోజనాలు ఏర్పాటు పేరిట వ్యాపారుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై జూన్ 27న 'భోజన ఖర్చులివ్వండి!' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై రాష్ట్ర పోలీసు బాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. జోనల్‌స్థాయి అధికారిని విచారణకు ఆదేశించారు. స్థానిక నిఘా విభాగం అధికారుల ప్రాథమిక విచారణలో ఎస్సై గంగన్న వసూళ్ల పర్వం బయటపడడంతో తొలుత ఎస్సైను వీఆర్‌కు ఆటాచ్ చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఎస్పీ సురేశ్‌కుమార్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో ఎస్పీ సురేశ్‌కుమార్ ఎస్సై గంగన్నను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే గంగన్న వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ.. పర్యటన ముగిసిన రెండోరోజు ఎస్సైపై వేటు వేసి సమగ్ర విచారణ చేపట్టడం గమనార్హం.

వసూళ్ల వెనుక అదృశ్య శక్తులెవరు?

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను అదునుగా తీసుకుని స్థానిక వర్తక సంఘాల నుంచి డబ్బులు వసూళ్లు చేయాలనే ఆలోచన ఎస్సై గంగన్నదేనా?


ఎస్సై గంగన్న

లేక దీని వెనుక ఎవరైనా అదృశ్య శక్తులు ఉన్నాయా? అన్నది ఇప్పుడు విచారణలో ప్రధానంగా తేలాల్సిన విషయం. ఎందుకంటే ఉన్నతాధికారుల ఆదేశాలు ఇసుమంతైనా లేకుండా ఎస్సై గంగన్న అంతటి సాహసానికి పాల్పడడనే వాదనలు పోలీసు శాఖలోనే గుప్పుమంటున్నాయి. పైగా 'సాక్షి' పత్రికలో కథనం వచ్చినా వసూళ్లు ఆగకపోవడం ఎస్సై గంగన్న వెనుక ఎవరో ఉన్నారనే వాదనలకు అద్దం పడుతోంది. పోలీసుల ప్రాథమిక విచారణలో రూ.5 లక్షలకు పైగా వసూళ్లు చేశారని తేలినట్లు సమాచారం. పోలీసులు సమగ్రంగా విచారిస్తే ఇది మరింత పెరిగే అవకాశం కూడా ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వాంకిడిలో దొంగనోట్ల కేసు విషయంలోనూ నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చే క్రమంలో రూ.30 లక్షలు చేతులు మారినట్లు ప్రచారం జరిగింది. ఇక్కడా ఆ అదృశ్య శక్తులకే భారీగా వాటాలు ముట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఎస్సై గంగన్న వసూళ్ల పర్వం వెనుకా కచ్చితంగా అదృశ్య శక్తుల హస్తం ఉన్నట్లు పోలీసు శాఖలో ప్రచారం ఊపందుకుంది. పైగా వసూళ్ల విషయంలో ఎస్సైను మాత్రమే బలిపశువును చేస్తున్నారన్న విమర్శలు సైతం ఉన్నాయి. వాస్తవాలు విచారణలో తేలాల్సి ఉంది.

ఆది నుంచి ఆరోపణలే..!

ఎస్సై గంగన్నపై ఆది నుంచి అవినీతి ఆరోపణలు ఉన్నట్లు పోలీసుశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. విధి నిర్వహణలోనూ దురుసుగా ప్రవర్తిస్తారని సమాచారం. చిటికీమాటికి వాహనాలను ఆపడం.. వాహనదారులతో గొడవకు దిగుతున్నారనే విషయం స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధికి తెలిసి ఎస్సైను పిలిచి 'ఇక్కడ పనిచేయాలనుకుంటున్నావా? లేదా?' అని గట్టిగా మందలించాకే కొంత తగ్గినట్లు తెలిసింది. అలాగే ఏదైన కేసు విషయంలో పోలీసుస్టేషన్ మెట్లెక్కితే ఇక అంతే! స్టేషన్ ఉన్నతాధికారి పేరు చెప్పి ఇరువర్గాల నుంచి అందినకాడికి దండుకుంటారని సమాచారం. ఆదాయానికి మించి ఆర్జించారనే వాదనలు ఆ శాఖవర్గాల్లోనే గుప్పుమంటున్నాయి. జిల్లా కేంద్రంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి బినామీగా ఉన్నారని తెలుస్తోంది. ఆ వ్యాపారి చేసే రియల్ దందాలో ఇతనికి వాటాలున్నాయని సమాచారం. ఇటీవల ఫోర్‌లేన్ రహదారికి ఆనుకుని ఉన్న ఓ రెండెకరాల భూమిని కబ్జా చేసి.. స్థల యజమానులను బెదిరించినా కబ్జాదారులపై ఎలాంటి కేసు నమోదు చేయకపోగా.. ఎస్సై గంగన్న స్థల యజమానులపై కేసు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారని బాధితులు వాపోతున్నారు. ఈ కబ్జా కథ వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఉండడంతోనే ఎస్సై గంగన్న రంగంలోకి దిగి మమ్మల్ని బెదిరించారని బాధితురాలు, స్థల యజమాని తారాబాయి ఆరోపిస్తోంది.

బాసరలో ముగిసిన గురుపౌర్ణమి ఉత్సవాలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: బాసరలో గురుపౌర్ణమి ఉత్సవాలు ముగిశాయి. మూడు రోజులుగా ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వేద వ్యాస మహర్షి ఆలయంలో పూజలు చేశారు. మూడు రోజులపాటు కొనసాగిన ఉత్సవాలను పూర్ణహూతి కార్యక్రమంతో ముగించారు. ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

నేడు పోడు పట్టాల పంపిణీ

- హాజరుకానున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

ఉట్నూర్‌రూరల్: పోడు భూములు సాగుచేస్తున్న గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పోడు పట్టాల పంపిణీ ఇటీవల సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్‌లో ప్రారంభించిన విషయం తెలసిందే. కాగా ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలకు చెందిన పోడు భూముల సాగు చేసుకునే గిరిజనులకు అటవీ, పర్యావరణ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయనున్నారు. స్థానిక కేబీ కాంప్లెక్స్‌లో పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. డివిజన్ పరిధిలోని ఉట్నూర్ మండలంలో 1489, సిరికొండ 755, ఇంద్రవెల్లి 376 మందికి నూతన పోడు పట్టాలు అందించనున్నారు. పోడు భూములకు పట్టాలు రావడంతో పోడు రైతులు సంతోశం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ భూమి పంచాలి


ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామీణ పేదల సంఘం నాయకులు


పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- ఐటీడీఏ ఎదుట ధర్నా

ఉట్నూర్‌రూరల్: అర్హులైన వారందరికీ భూమి పంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ మాట్లాడుతూ.. భూమిలేని ఆదివాసీ గిరిజన, గిరిజనేతర పేదలు కడెం కెనాల్ కింద పరంపోగ్ భూమిని వ్యవసాయానికి అనుకూలంగా చేసుకున్నారని, భూమి అడవి ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో అటవీ అధికారులు, పోలీసు అధికారులు కలిసి వందల మందిపై కేసులు పెట్టారని, నేటికీ ఆ కోర్టు కేసు ఎదుర్కొని ఆర్థికంగా చితికిపోయిన నిరుపేద కుటుంబీకులు కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గిరిజన, దళిత నిరుపేదలకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ నిజమైన బాధితులకు ఇవ్వడం లేదని, అనుకూలమైన వారికి పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జరిగే సర్వేలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, భూమి ఉన్న వారికే భూమి చెందేలా స్థానిక అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే రీ సర్వే చేయించి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందించారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొటికెల ఆశన్న, ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు దారంగుల ఎల్లయ్య, నర్సయ్య, బోడ కిషన్, చంద్రయ్య, రాజమౌళి, ధర్మ ఉన్నారు.

విద్య, వైద్యంపై దృష్టి


ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- పోడు పట్టాల పంపిణీ సజావుగా సాగేలా చర్యలు
- గిరిజన సమస్యలపై అవగాహన ఉంది
- ఈ ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా..
- దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

సాక్షి,ఆదిలాబాద్: ప్రభుత్వ పథకాలను గిరిజనులకు వందశాతం దరిచేరేలా కృషి చేస్తానని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె రోజంతా బిజీబిజీగా గడిపారు. ఉదయం 9గంటల్లోపే ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి నుంచి చార్జ్ తీసుకున్నారు. అనంతరం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఆ తర్వాత ఉట్నూర్ చేరుకున్నారు. తొలిరోజు గ్రీవెన్స్‌లో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అంతకుముందు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది నూతన పీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టనుండగా వాటి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో చాహత్ బాజ్‌పాయ్ 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

సాక్షి: గిరిజన సమస్యలపై అవగాహన ఉందా..?

పీవో: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తుండగా గిరిజన సమస్యలపై అనేక మంది నన్ను కలవడం జరిగింది. ఆదివాసీ, గిరిజన సమస్యలపై అవగాహన ఉంది. ఈ ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

సాక్షి: విధుల నిర్వహణలో మీ ప్రాధాన్యత అంశాలు..?

పీవో: గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, వైద్య సేవలు మరింతగా మెరుగుపరిచే విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తాను. ప్రభుత్వ పథకాలను వంద శాతం గిరిజనులకు అందేలా తొలిరోజు నుంచే నా ప్రయత్నం కొనసాగుతుంది.

సాక్షి: వసతిగృహాల్లో సమస్యలు పేరుకుపోయాయి. సరుకుల పంపిణీ జరగడం లేదు. మీ దృష్టికి వచ్చిందా..?

పీవో: వసతిగృహాల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతాను. ఈ విషయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో చర్చిస్తాను. సరుకుల పంపిణీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

సాక్షి: ఐటీడీఏ సమావేశాలు నిరంతరంగా జరగడం లేదు. ఈ విషయంలో మీరేమంటారు..?

పీవో:బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐటీడీఏలోని అన్ని విభాగాల అధికారులతో వివిధ అంశాలపై చర్చించాను. ఐటీడీఏ సమావేశాలు నిరంతరం కొనసాగేలా చర్యలు చేపడతాను.

సాక్షి: పోడు పట్టాల పంపిణీలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

పీవో: పోడు పట్టాల పంపిణీ మంగళవారం కేబీ కాంప్లెక్స్‌లో ప్రారంభించనున్నాం. ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపడతాం. ఏజెన్సీ ప్రాంతాల్లో దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

ఆ దుండగులను ఉరి తీయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

- కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా

కైలాస్‌నగర్: తోటి తెగకు చెందిన కుడ్మెత జంగుబాయి అనే మహిళపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన దుండగులను ఉరి తీయాలనే డిమాండ్ చేస్తూ ఆదివాసీలు సోమవారం కదం తొక్కారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆదివాసీ మహిళలు, యువకులు ఆదివాసీ బిరుదు గోండ్ యువసేన, మహిళ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సంప్రదాయ తుడుం, డోలు మోగిస్తు స్థానిక ఆర్అండ్‌బీ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి ప్రధాన గేటు ఎదుట బైఠాయించి దుండగులను శిక్షించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ నిత్యం ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇతర కులాల్లో ఇదే ఘటన జరిగితే ఎన్ కౌంట్ చేసే వారన్నారు. కానీ ఆదివాసీ మహిళలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దుండగులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు బాధితురాలి కుమారుడి ఉన్నత చదువుల బాధ్యత ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్ రాజ్ వారి వద్దకు రాగా దుండగులను ఉరి తీయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన పరిహారాన్ని త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీడీఏ డీడీని బాధిత ఇంటికి పంపించి స్థితిగతులను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ప్రత్యేక కేసుగా పరిగణలోకి తీసుకుని వీలైనంత త్వరగా కోర్టుకు సాక్ష్యాలు అందించేలా పోలీసులకు సూచించినట్లు తెలిపారు. దీంతో ఆదివాసీలు తమ ఆందోళనను విరమించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం ఉదయం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఇందులో గాదిగూడ మండలం కాండో గ్రామానికి చెందిన హెరకుమ్ర షేకు తమ గ్రామంలో రేషన్ బియ్యం నిల్వ కోసం భవనం మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. అలాగే పెంబి మండలం పోచంపెల్లి గ్రామానికి చెందిన గుగ్లావత్ వనిత సాగు పట్టా మంజూరు కోసం, ఇంద్రవెల్లి మండలం మారుతిగూడ గ్రామస్తులు పక్కా ఇళ్లు ఇప్పించాలని, ఆదిలాబాద్ మండలం అంకాపూర్ గ్రామస్తులు తమ గ్రామానికి తాగునీరు, విద్యుత్, రోడ్లు మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. వీటితో పాటు వివిధ సమస్యలపై పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఇందులో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఏడియం అండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఐటీడీఏ ఏవో రాంబాబు, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో ఐటీడీఏ పీవో, కలెక్టర్ పూజలు


పీవో చాహత్ బాజ్‌పాయ్, నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డిలను సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్‌పాయ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, మెస్రం వంశీయులు మేస్రం దాదారావ్, మెస్రం బాదిరావ్, మెస్రం దేవ్‌రావ్, మెస్రం మానిక్‌రావ్, గ్రామస్తులు సిడాం భీంరావ్, తోడసం సాగర్ ఉన్నారు.

మహబూబాబాద్‌లో నిర్మల్‌వాసి మృతి

- కుక్కను తప్పించబోయి.. కారు బోల్తా
- తండ్రి మృతి... కొడుకుకు స్వల్ప గాయాలు


శ్రీనివాస్ మృతదేహం

మహబూబాబాద్ రూరల్: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి మహబూబాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. రూరల్ ఎస్సై బి.రామ్‌చరణ్ కథనం ప్రకారం... నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన తన్నీరు శ్రీనివాస్(58) కుటుంబంతో కలిసి కొంత కాలంగా వరంగల్‌లో నివాసముంటున్నాడు. వృత్తి రీత్యా జాతకాల రాళ్లు, రోల్డ్‌గోల్డ్ వ్యాపారం చేసే శ్రీనివాస్.. తన కుమారుడు చక్రధర్‌తో కలిసి కారులో మహబూబాబాద్‌కు వచ్చాడు. అక్కడ నుంచి భద్రాచలం వెళ్తుండగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి బ్రిడ్జి దాటగానే కుక్క అడ్డువచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో కారు అదుపు తప్పి బోల్తాపడింది. శ్రీనివాస్ అపస్మారకస్థితికి చేరుకోగా చక్రధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శ్రీనివాస్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనా స్థలిని రూరల్ ఎస్సై రామ్‌చరణ్, ఏఎస్సై సూరయ్య, పీసీ గౌతమ్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



ఆకాశం... కనువిందు

ఆకాశంలో అద్భుత దృశ్యాలకు కొదవలేదు. రూపు మారే మేఘాలు, మెరిసే నక్షత్రాలు.. రంగుల హరివిల్లు.. ఇలా ఎన్నో రమణీయ దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటాయి. అలాంటి అద్భుత దృశ్యాలు సోమవారం ఆకాశంలో ఆవిష్కృతమయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం సూర్య అస్తమయం సమయంలో ఆకాశం ఎరుపురంగుగా మారి.. మరికొద్ది సేపటికే వెండి మబ్బులు కమ్ముకున్నాయి. ఆ సుందర దృశ్యాలు చూపరులకు కనువిందు చేశాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

